# సాక్షి తిరుపతి

గురువారం । 6 । ఫిబ్రవరి । 2025






### 'అగ్ర'తాంబూలం

ఏఎంసీ చైర్మన్ పదవుల రిజర్వేషన్లలో అగ్రవర్ణాల వారికే ప్రాధాన్యం ఇచ్చారు. రాబడి ఎక్కువ ఉన్న వాటిని ఓసీలకు కేటాయించారు. - 8లో



### ఐజర్‌లో నేటి నుంచి తిరునాల్

ఏర్పేడు వద్ద ఉన్న ఐజర్‌లో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు తిరునాల్ పేరుతో కార్యక్రమం జరగనుంది. - 8లో



### ఊర్లో దొంగలు పడ్డారు!

ఒకటి కాదు..రెండు కాదు.. ఏకంగా 9 ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన ముంగళి పట్టులో చోటు చేసుకుంది. - 8లో

## న్యూస్‌రీల్

### శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు

**తిరుమల:** శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,599 మంది స్వామివారిని దర్శించుకోగా 16,069 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.21 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. కాగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించబోరని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే తిరుమల శ్రీవారిని జనవరి నెలలో 20.50 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. హుండీ ద్వారా స్వామివారికి రూ.106.17 కోట్ల ఆదాయం లభించింది. వరుసగా 35వ నెల కూడా రూ.100 కోట్లు మార్కులు దాటినట్టుగా శ్రీవారి ఆదాయాన్ని గణంకాలు చెబుతున్నాయి. శ్రీవారి ఆదాయం 2022 మార్చి నెల నుంచి వరుసగా రూ.100 కోట్లు మార్కును దాటుతూ వచ్చింది.

### సాంకేతిక లోపంతో ఎయిర్ ఎలియన్స్ విమానం రద్దు



**శ్రీకాళహస్తి రూరల్(రేణిగుంట):** హైదరాబాద్ నుంచి తిరుపతికి రావాల్సిన ఎయిర్ ఎలియన్స్ విమానం రద్దు కావడంతో ప్రయాణికులు నిరాశతో వెనుదిరిగారు. హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి బుధవారం ఉదయం 7.25 నిమిషాలకు తిరుపతి విమానాశ్రయానికి రావాల్సిన ఎయిర్ ఎలియన్స్ విమానం సాంకేతిక లోపంతో రద్దయినట్లు చివరిలో అధికారులు చెప్పారు. అప్పటికే విమానంలో వస్తున్న తమ వారి కోసం విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికుల బంధువులు నిరాశతో వెనుదిరిగారు. తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకుని విమానాశ్రయానికి చేరుకున్న ప్రయాణికులు విమానం రద్దయిన విషయం తెలుసుకు ఎయిర్ ఎలియన్స్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఎయిర్ ఎలియన్స్ విమానం గత రెండు రోజులుగా ఇలాగే రద్దు అవుతున్నట్లు విమానాశ్రయ సిబ్బంది తెలిపారు.

# అరాచక తీర కేసులు

దాడులు.. దౌర్జన్యాలు..అరాచకాలు..ఆస్తుల విధ్వంసాలు..అక్రమ నిర్బంధాలు..అర్ధరాత్రుల్లో ఆగడాలు..కిడ్నాప్‌లు.. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో కార్పొరేటర్ల బస్సు అద్దాలు, ఫొటో పాత్రికేయుల కెమెరాల ధ్వంసం.. అన్నీ వారికే చెల్లు.. అయినా కూటమి కాలకేయులపై కేసు మాత్రం నిల్.. అధికార పార్టీ గూండాల చేతిలో కష్టనష్టాల పాలైన బాధితులు..వైఎస్సార్ సీపీ శ్రేణులపై మాత్రం కేసులు నమోదు.. ఇదేం పాలన 'బాబూ' అని తిరునగరి జనం విస్తుపోతున్న వైనం.. ఇదీ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఉపఎన్నికల చిత్రం.



ఎస్వీయూలో కూటమి నేతల దాష్టీకం(ఫైల్)

### కిడ్నాపర్లపై కేసులేవీ?

ఈనెల 3న ఉదయం నలుగురు కార్పొరేటర్లను పోలీసుల ఎదుటే కూటమి గూండాలు లాక్కెళ్లారు. అదే రోజు రాత్రి ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కిడ్నాప్‌నకు గురయ్యారు. కిడ్నాప్ విషయం అందరికీ తెలిసిందే. అయితే కిడ్నాప్‌లు చేసిన వారెవరిపైనా ఇప్పటి వరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు. ఇంకా అనీష్ రాయల్ భార్య మమత ఉంటున్న నివాసంలోకి చొరబడి ఆమెను కిడ్నాప్ చేసేందుకు యత్నించిన వారిపైనా కేసు లేదు. ఆమె 100 కాల్ చేసినా స్పందించకపోగా.. మమతను రక్షించేందుకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులపైనే కేసు నమోదు చేశారు. ఇలా దాడులు, దౌర్జన్యాలకు పాల్పడిన వారిని విడిచిపెట్టి.. బాధితులైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. రక్షించాల్సిన పోలీసులే.. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లొంగి చట్టాన్ని అపహాస్యం చేస్తుంటే ఈ వ్యవస్థ ఉన్నది ఎవరి కోసం అంటూ న్యాయనిపుణులు ప్రశ్నిస్తున్నారు.

### బాధితులైన వైఎస్సార్‌సీపీ శ్రేణులపైనే కేసులు

- 50 మందిపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- దాడులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లు చేసింది కూటమి నేతలు
- వీడియో, ఫొటోలున్నా.. పోలీసుల ఎదుటే జరిగినా నో కేస్
- రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు



బస్సుపై దాడి చేస్తున్న కూటమి నేతలు(ఫైల్)

**సాక్షి టాస్క్‌ఫోర్స్:** తిరుపతి డిప్యూటీ మేయర్ ఉప ఎన్నిక సందర్భంగా దాడులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లు చేసి, అరాచకం సృష్టించిన కూటమి గూండాలపై ఎటువంటి కేసులు నమోదు కాలేదు. అన్ని రకాలుగా బాధితులైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై మాత్రం కేసులు నమోదయ్యాయి. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును చూసి జనం విస్తుపోతున్నారు. ఇదేమీ పాలన అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి డిప్యూటీ మేయర్ ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ అయిన వెంటనే.. కూటమి నేతలు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లే లక్ష్యంగా అరాచకాలకు పూనుకున్న విషయం తెలిసిందే. ముందుగా వైఎస్సార్‌సీపీ డిప్యూటీ మేయర్ అభ్యర్థి శేఖర్‌రెడ్డి, మరి కొందరు కార్పొరేటర్ల ఆస్తులకు సంబంధించి ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారు. సుప్రీం కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా అధికార యంత్రాంగం మొత్తం విధ్వంసంలో పాల్గొన్నా ఎటువంటి కేసు లేదు. ఆ తరువాత 2వ తేదీ అర్ధరాత్రి దాటిన తరువాత కూటమి గూండాలు చిత్తూరులోని ఓ హోటల్‌లో ఉన్న కార్పొరేటర్ల గదుల్లోకి చొరబడేందుకు యత్నించారు. మహిళలు అని కూడా చూడకుండా అర్ధరాత్రి తలుపులు కొడుతూ భయాందోళనకు గురిచేశారు. ఆపై కార్పొరేటర్లను అక్రమంగా నిర్బంధించారు. కిడ్నాప్ చేసేందుకు యత్నించారు. ఈ ఘటనలో తిరుపతి ఎమ్మెల్యే కుమారుడు మదన్, జనసేన నేతలు జేబీ శ్రీనివాసులు, పులిగోరు మురళి, మరి కొందరు పాల్గొన్నట్లు సాక్ష్యాలున్నా ఎవరిపైనా ఎలాంటి కేసులు నమోదు కాలేదు.

### పోలీసుల సాక్షిగా విధ్వంసంలో పాల్గొన్న వారిపై కేసులేవీ?

ఉప ఎన్నిక రోజైన సోమవారం ఉదయం 10.15 నుంచి 11 గంటల మధ్యలో ఎస్వీయూ పోలీస్‌స్టేషన్‌కు అత్యంత సమీపంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేట ర్లు ప్రయాణిస్తున్న బస్సుపై కూటమి గూండాలు దాడి చేశారు. బస్సు అద్దాలు పగులగొట్టి లోపలకు చొరబడి తిరుపతి ఎంపీ గురుమూర్తి, కార్పొరేటర్ల పై దాడికి తెగబడ్డారు. అందరూ చూస్తుండగానే నలుగురు కార్పొరేటర్లను కిడ్నాప్ చేశారు. ఈ విధ్వంసం మొత్తం పోలీసుల సాక్షిగా జరిగింది. వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు మాత్రం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని కేసు నమోదు చేయడం గమనార్హం. ఈ ఘటనలో ఎవరెవరు పాల్గొన్నారో.. అందుకు సంబంధించి వీడియోలు, ఫొటోలున్నా గుర్తు తెలియ ని వ్యక్తులు దాడి చేశారని కేసు నమోదు చేశారు. ఈ విధ్వంస కాండను చిత్రీకరిస్తున్న సాక్షి ఫొటోగ్రాఫర్ గిరిప్రసాద్ కెమెరాను లాక్కుని ధ్వంసం చేశా రు. ఆపై గిరిప్రసాద్‌పై దాడి చేశారు. దీనిపై బాధితుడు నేరుగా యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి రా త పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇంతరకు కేసు నమోదు చేయలేదు.ఎస్వీయూ పోలీస్‌స్టేషన్ కూడలి వద్ద శాప్ చైర్మన్ రవినాయుడు వాహనాన్ని పోలీసులు అడ్డు కున్నందుకు రవినాయుడు, ఆయన అనుచరులు వాహనాలను దిగి పోలీసులపైకి ఎగబడ్డారు. బూతులు తిడుతూ దాడికి యత్నించారు. ఆ సమయంలో ఇద్దరు పోలీసులు కిందపడ్డారు. అయినా వారిపై కూడా కేసుల్లేవు.



భయాందోళన చెందుతున్న మేయర్ శిరీష(ఫైల్)

### అక్షయ పాత్ర భోజనంపై ప్రభుత్వానికి నివేదిక

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

**చిల్లకూరు:** పట్టణ ప్రాంతాలలోని ప్రభుత్వ పాఠశాలలకు అక్షయ పాత్ర ద్వారా సరఫరా చేసే భోజనం కన్నా ప్రభుత్వ పాఠశాలలో వంట వారు వండి వడ్డించే భోజనాన్ని పిల్లలు ఎక్కువ ఇష్టంగా తింటున్నట్లు గుర్తించామని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలతోపాటు గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ పాఠశాల, శివాలయం ప్రాంతంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రం, రెండో పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులను భోజనం రుచిపై ఆరా తీశారు. అనంతరం పిల్లల నైపుణ్యాభివృద్ధిని పరిశీలించి, పలు ప్రశ్నలు అడిగి వారి నుంచి సమాధానాలు రాబట్టి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పలు పాఠశాల్లో మధ్యాహ్నం వడ్డించే అక్షయ పాత్ర భోజనాన్ని విద్యార్థులు సరిగా తినడం లేదన్నారు. దీనికి పలు రకాల కారణాలు వారు చెబుతున్నారని, ఒకే విధమైన రుచి ఉండడంతో సరిగా తినలేక బయట పారవేస్తున్నట్లు చెబుతున్నారన్నారు. అలాగే కొంత మంది విద్యార్థులు తమ ఇళ్ల నుంచి భోజనం తీసుకుని వస్తున్నట్లు గుర్తించామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు చేసే భోజనాన్ని మాత్రం ఎక్కువ మంది పార వేయకుండా ఇష్టంగా తినడం గమనించామని, తాను రుచి చూడగా బాగుందని చెప్పారు. దీంతో అక్షయపాత్ర భోజనంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొనసాగించడమా, మధ్యాహ్న భోజన నిర్వహకుల ద్వారా వడ్డించడమా? అన్న ఆలోచన చేస్తామన్నారు. అనంతరం ఆయా పాఠశాలలు, గురుకుల పాఠశాలల వంటగదులు, పరిసరాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు.

### జీతాలు ఎప్పుడిస్తారు బాబూ!

**తిరుపతి సిటీ:** ఎస్వీయూలో వేతన జీవుల అవస్థలు వర్ణణాతీతం. గత ఏడు నెలలుగా నెల ప్రారంభంలో జీతాలు అందిన దాఖలాలు లేవు. ఆరో తేదీ వస్తున్నా అధికారులు వేతనాల ప్రస్తవన ఎత్తడం లేదని శాశ్వత, తాత్కాలిక, పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచే ప్రతి నెలా క్రమం తప్పకుండా ఒకటో తారీఖున వేతనాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందంటూ ఉద్యోగులు మదనపడుతున్నారు. సకాలంలో జీతాలందక కుటుంబం గడవకపోగా, బ్యాంకు రుణాలు, ఈఎంఐల చెల్లింపులు వేధిస్తున్నాయని, ఏమి చేయాలో పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నామని వర్సిటీలో ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. చిన్న, మధ్యతరగతి ఉద్యోగులు బంగారు నగలను తాకట్టు పెట్టి అవసరాలను తీర్చుకుంటున్నారు. మరికొందరు బయట వ్యక్తుల వద్ద వడ్డీకి అప్పు తెచ్చుకుని కుటుంబాన్ని పోషిస్తున్నారంటే వారి పరిస్థితి ఏ స్థాయిలో ఉందే అర్థమవుతోంది.

### 14 లక్షల చేప పిల్లల విడుదల



చేపల పిల్లలను వదులుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**నాగలాపురం:** పిచ్చాటూరు మండలంలోని అరణియార్ ప్రాజెక్టులో ప్రధాన మంత్రి మత్స్యయోజన పథకం ద్వారా 14 లక్షల చేపల పిల్లలను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ జలాశయంలోకి వదిలారు. అనంతరం అరణియార్ ప్రాజెక్ట్‌లో తుడా నిధులు రూ.2 కోట్ల వ్యయంతో జరుగుతున్న వ్యూటవర్, బోటింగ్ జెట్టి పనులను పరిశీలించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తరువాత అక్కడ నుంచి మెయిన్ రోడ్డు నుంచి స్థానిక దళితవాడ వరకు రూ.13.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అక్కడ నుంచి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ప్రసూతి విభాగం, ల్యాబ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, నాగరాజు, ఎఫ్‌బీఐ నరేంద్ర, ఆరణియార్ జేఈ లోకేశ్వర్ రెడ్డి, మదన్‌గోపాల్ రెడ్డి, డీఈ శ్రీరామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి

**తిరుపతి ఎడ్యుకేషన్ :** జిల్లాలో ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లాలోని అన్ని యాజమాన్య కళాశాలల సైన్స్ అధ్యాపకులతో ప్రాక్టికల్స్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు స్పెల్‌లో ప్రాక్టికల్స్ జరుగుతాయని, మొదటి స్పెల్ ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఒకేషనల్ విద్యార్థులకు, చివరి రెండు స్పెల్స్‌ను 10 నుంచి 19వ తేదీ వరకు జనరల్ విద్యార్థులకు 124 పరీక్ష కేంద్రాల్లో ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించి 91 కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించే పరీక్షకు జనరల్ విద్యార్థులు 23,793 మంది విడతల వారీగా హాజరవుతారని, అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సైన్స్ ఎగ్జామినర్లు ఆయా సెషన్లకు సంబంధించి అప్పటికప్పుడే మూల్యాంకనం చేసి, విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పరీక్షలకు సంబంధించి ఈ ఏడాది జిల్లా కోడ్‌ను 19గా మార్చారని, దీనిని గుర్తుంచుకుని జిల్లా కోడ్‌ను 19గా నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రైవేటు కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో సీఎస్‌లుగా ప్రభుత్వ లెక్చరర్లు విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్స్‌లో ఎటువంటి అవకతవకలు జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పరీక్షల ప్రత్యేకాధికారి రఘుపతి, డీఈసీ సభ్యులు గోపాల్‌రెడ్డి, వి.రవి, సైన్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

### ఏ మద్యం దుకాణానికైనా దరఖాస్తు చేసుకోండి

- దరఖాస్తుల గడువు 8 వరకు పొడిగింపు
- 10న లాటరీ పద్ధతిలో షాపులు కేటాయింపు



నాగమల్లేశ్వర్‌రెడ్డి

**తిరుపతి క్రైం:** జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 23 మద్యం దుకాణాల్లో ఆ కులాలకు చెందిన తిరుపతి జిల్లా వాసులు ఏ షాపునకు అయినా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఏపీ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్‌లైన్, ఆన్‌లైన్‌లో కల్లుగీత కార్మికులు మద్యం దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు చెప్పారు. అలాగే ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయిస్తామన్నారు. కొందరు గీత కార్మికులు ఏ నియోజకవర్గం పరిధిలో నివాసం ఉంటున్నారో ఆ నియోజకవర్గంలోని మద్యం దుకాణాలకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని భావిస్తున్నారన్నారు. అలాంటి నిబంధనలేమీ లేవని, జిల్లాలో ఎక్కడైనా కల్లుగీత కార్మికుల పరిధిలోని ఉపకులాలకు కేటాయించిన షాపులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ముందుగా బుధవారం వరకు మాత్రమే దరఖాస్తుకు గడువు ఇచ్చామని, దాంతో ఇ ప్పటివరకు 23 దుకాణాలకు 38 దరఖాస్తులు మాత్రమే వచ్చాయన్నారు. ఈ క్రమంలో మరో 3 రోజులు గడువు పొడిగించామన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రెండేళ్లపాటు దుకాణం నడుపుకోవడానికి వీలుంటుందని చెప్పారు. అయితే దరఖాస్తు సమయంలో రూ.2 లక్షలు అప్లికేషన్ ఫీజు చెల్లించాలని, దుకాణం రాకుంటే ఫీజు తిరిగి ఇవ్వరని చెప్పారు. మొదటి ఏడాది పట్టణం, నగరం ప్రాంతంలో మద్యం దుకాణం వచ్చిన వారు రూ.21,66,667, రెండో సంవత్సరం రూ.35,75,000 ప్రభుత్వానికి చెల్లించాలని చెప్పారు. మండల ప్రాంతాల్లో తొలి ఏడాది రూ.18,33,334, రెండో ఏడాది రూ.30,25,000 చెల్లించాలన్నారు.

# పల్లె బడి మూత



తాము చేరలేని విజయతీరాల్ని తమ పిల్లలు చేరాలని ఎన్నో కలలు కంటారు పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు. అందుకోసం తహతహలాడుతారు. తమ పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరితే చూడాలని తాపత్రయపడతారు. అయితే పల్లెల్లోని బడులను విలీనం చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఏకోపాధ్యాయ పాఠశాలల గుర్తింపునకు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో తమ పల్లెలో బడి మూతపడితే తమ బిడ్డలను ఎక్కడ చదివించాలి.. ఎలా పాఠశాలకు పంపాలని ఆవేదన చెందుతున్నారు.

### సర్కారు బడిపై విలీన పిడుగు

- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- విలీనం ఉండదని నాడు హామీ
- నేడు విలీన ప్రక్రియకు ముందడుగు



పిచ్చాటూరు హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు

**చిత్తూరు కలెక్టరేట్ :** కూటమి టీడీపీ అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే సర్కారు బడులపై గుదిబండ వేసింది. సర్కారు బడులను అభివృద్ధి చేయాల్సింది పోయి విలీనం అనే పేరుతో కత్తి దూస్తోంది. ఈ విలీనం ప్రక్రియను చేపట్టమని హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీని తుంగలో తొక్కింది. కార్పొరేట్ బడులకు మేలు చేకూర్చే విధంగా అసంబద్ధత నిర్ణయాలు తీసుకుంటోంది. జిల్లాలోని ప్రతి మండలంలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యాశాఖను ఆదేశించింది. ఈ మేరకు గుట్టు చప్పుడు కాకుండా ప్రతిపాదనలు సైతం సిద్ధం చేసి ఇటీవల తిరుపతి జిల్లా కేంద్రంలో నోడల్ సమావేశం నిర్వహించి చర్చించారు.

**ప్రపంచబ్యాంకు ఆంక్షలతోనే..**

ప్రపంచ బ్యాంకు ఆంక్షలతోనే కూటమి సర్కారు పాఠశాలల విలీనానికి తెరలేపింది. అధికారంలోకి వచ్చిన కొత్తలో రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ సంఘ నేతలతో సమావేశం ఏర్పాటు చేసి విలీన ప్రక్రియ ఉండదని ప్రకటించారు. తీరా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విలీన ప్రక్రియకు తెర లేపారు. టీచర్ల సర్దుబాటు కోసం పిల్లల అవసరాలు, వారి సమస్యలను గాలికి వదిలేస్తోంది.

**హామీలు తూచ్**

జిల్లాలోని ప్రతి పల్లెలో 3 కి.మీ పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలు, 5.కి.మీ పరిధిలో ఉన్నత పాఠశాలలు గతం నుంచి నడుస్తున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ప్రస్తుతం విలీనం పేరుతో సర్కారు బడులకు నష్టం చేకూరేలా చర్యలు చేపడుతోంది. విలీనం ప్రక్రియ వొద్దని అన్ని ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రులు, టీచర్లు మొరపెట్టుకున్నారు. ఇదే సందర్భంలో విలీనం చేసేది లేదని ప్రస్తుత కూటమి టీడీపీనే హామీ ఇచ్చింది. అయితే ప్రస్తుతం ఆ హామీని తూచ్ మనిపించింది. విలీనం ప్రక్రియ చేపడితే గ్రామం నుంచి విద్యార్థులు వేరే గ్రామాలకు వెళ్లి చదవాల్సిన పరిస్థితి ఉంటుందని తల్లిదండ్రులు మొరపెట్టుకుంటున్నారు. డ్రాపౌట్స్ శాతం పెరుగుతుందని విద్యావేత్తలు వాపోతున్నారు. ఈ విలీన కసరత్తు పూర్తి అయితే తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల కు పిల్లలను పంపడం ఖాయమని టీచర్లు వెల్లడిస్తున్నారు.

**విలీన వేదన..**

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1,844, ప్రాథమికోన్నత 188, ఉన్నత పాఠశాలలు 322 మొత్తం 2,354 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో 94,178, ప్రాథమికోన్నతలో 57,801, ఉన్నత పాఠశాలల్లో 35,465 మొత్తం 1,87,444 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల్లో 4,784, ప్రాథమికోన్నతలో 5,678, ఉన్నత పాఠశాలల్లో 7,415 మొత్తం 17,877 మంది టీచర్లు విధులు నిర్వహిస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రకరకాల కారణాలతో పాఠశాల విలీన ప్రక్రియకు తెరలేపింది. ఈ ప్రక్రియతో పేదల పిల్లలను విద్యకు దూరం చేస్తోంది. వారితో పాటు తల్లిదండ్రులకు ఆందోళనకు గురిచేస్తోంది.

**కసరత్తు ఇలా..**

- జిల్లాలోని ఏకోపాధ్యాయ పాఠశాలలను గుర్తించాలని విద్యాశాఖాధికారులు ఆదేశించారు. తిరుపతి జిల్లాలో 344 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలున్నట్లు గుర్తించారు.
- 60 మంది విద్యార్థున్న ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ ప్రైమరీ పేరుతో మార్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ మోడల్ ప్రైమరీ (ఆదర్శ పాఠశాలలు) ఎక్కడెక్కడ అవసరమని కసరత్తు చేపడుతున్నారు.
- ప్రీ ప్రైమరీ, ఫౌండేషన్ స్కూళ్ల అవసరం ఉంటే వాటి వివరాలతో పాటు 1 నుంచి 5 వ తరగతి వరకు బోధించే పాఠశాలల వివరాలు సేకరిస్తున్నారు. అక్కడ 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించి ప్రత్యేక హెచ్ఎంను నియమించనున్నారు.
- 6 నుంచి 10 తరగతులు బోధించే పాఠశాలల వివరాలతోపాటు 20 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న బడుల వివరాలను సేకరించి నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

**తిరుపతి జిల్లాలోని ప్రభుత్వపాఠశాలల సమాచారం**

| పాఠశాల కేటగిరీ | స్కూళ్ల సంఖ్య | విద్యార్థుల సంఖ్య |
|---|---|---|
| ప్రాథమిక | 1,844 | 94,178 |
| ప్రాథమికోన్నత | 188 | 57,801 |
| ఉన్నత | 322 | 35,465 |
| మొత్తం | 2,354 | 1,87,444 |

**విలీన ప్రక్రియతో నష్టమే..**




విలీన ప్రక్రియతో ప్రభుత్వ బడులకు నష్టమే కాని మేలు చేకూరదు. ప్రభుత్వం విలీన ప్రక్రియను చేపట్టి దూరంగా ఉన్న విద్యార్థులకు రవాణా చార్జీలు ఇచ్చి, చేతులు దులుపుకోవాలనుకుంటోంది. అలా కాకుండా విలీన ప్రక్రియను చేపడితే ప్రభుత్వమే విద్యార్థుల రవాణాకు బాధ్యత వహించాలి. దూరాభారంగా ఉండే పిల్లలను క్షేమంగా ఇళ్లకు చేర్చే బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలి. – బాలాజీ, ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు

**కసరత్తు హామీకి విరుద్ధమే..**



కూటమి ప్రభుత్వం హామీకి విరుద్ధంగా విలీన ప్రక్రియ చేపడుతోంది. 117 జీఓను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో సంఘ నేతలతో నిర్వహించిన సమావేశంలో విలీన ప్రక్రియ కసరత్తు విధివిధానాలు చెప్పింది ఒకటి.. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో చేస్తున్నది మరొకటి. ఈ విలీన ప్రక్రియ చాలా నష్టం చేకూరుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విలీన ప్రక్రియను నిలిపివేయాలి. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం. – దేవానంద్, ఏపీటీఎఫ్ (1938) జిల్లా ఉపాధ్యక్షులు

**డ్రాపౌట్స్ పెరుగుతారు**



విలీన ప్రక్రియతో డ్రాపౌట్స్ ఎక్కువ అవుతారు. ప్రభుత్వం ఏది చేపట్టినా మేలు చేకూరేలా ఉండాలి కాని నష్టం చేకూర్చకూడదు. ఈ కసరత్తు వల్ల ప్రైవేట్ బడులకు విద్యార్థులు వెళ్లిపోతారు. విలీన కసరత్తుతో గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉంది. – ముత్యాలరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

## క్లుప్తంగా

### ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై అక్కడ విధులు నిర్వహించిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ చిత్తూరు కలెక్టర్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు అదే పంచాయతీకి చెందిన ఆడిపూడి ఆశ ఇందిరానగర్ పంచాయతీలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగం జరిగినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పలుసార్లు పలువురు ప్రత్యేక అధికారులు విచారణ అధికారులుగా నియామకమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. దీంతో అక్కడ విధులు నిర్వహించిన చిట్టిబాబు జనరల్ ఫండ్, 14–15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10,13,412, ఆర్. తిరుమల జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.36,417, ఎ.నరేష్ జనరల్ ఫండ్ ద్వారా రూ.1,55,901 నిధులు దుర్వినియోగం చేసినట్లు విచారణలో అధికారులు తేల్చారు. దీంతో సంబంధిత పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు పడింది. ఆ మేరకు మండల ఎంపీడీఓకు ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు.

### స్వర్ణముఖిలో పడి యువకుడి మృతి



సుకుమార్ (ఫైల్)

వాకాడు: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు స్వర్ణముఖిలో పడి, గల్లంతు అయ్యాడు. వేటకు వెళ్లిన అతడు తిరిగి రాక పోవడంతో స్థానికులు నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. అతడి మృతదేహం లభ్యం అయ్యింది. ఈ సంఘటన బుధవారం బాలిరెడ్డిపాళెంలో చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. బాలిరెడ్డిపాళెం ఆస్పత్రి దళితవాడకు చెందిన ఇనమాల సుకుమార్ (28) తల్లిదండ్రులు లేక పోవడంతో ఒంటరిగా జీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను చేపలు పట్టేందుకు స్వర్ణముఖి వద్దకు వెళ్లగా అక్కడ ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతు అయ్యాడు. స్థానికులు చేపల వేటకు వెళ్లిన యువకుడు తిరిగి రాక పోవడంతో అనుమానం వచ్చి నదిలో గాలించగా గుంతలో అతని మృతదేహం లభ్యమైంది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకతకు పాతర.. బీసీలకు మొండి చేయి.. ఓసీలకు అధిక ప్రాధాన్యం.. ఎక్కువ ఆదాయం ఉన్న కమిటీలన్నీ అగ్రవర్ణాల పరం.. ఇదీ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల రిజర్వేషన్ల కేటాయింపు తీరు. ఆ మేరకైనా కూటమిలోని అన్ని పార్టీలకు సమన్యాయం జరుగుతుందో? లేదోనన్న సందేహం.. అప్పుడూ ఒకే పార్టీకి పెద్దపీట వేస్తారేమోనన్న ఆశావహుల అనుమానం. మార్కెట్ కమిటీల పాలవర్గం ఎంపికలపై కూటమిలో వినిపిస్తున్న గుసగుసలు.




# అగ్రతాంబూలం

**కీలక కమిటీలు ఓసీలకే**

- మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లు ఖరారు
- జిల్లాలో 12 వ్యవసాయ మార్కెట్ కమిటీలు
- అత్యధిక రాబడి శ్రీకాళహస్తి కమిటీకే..
- నామినేటెడ్ పదవులకు లాబీయింగ్ మొదలు
- జనరల్‌కే అధిక స్థానాలు

**రిజర్వేషన్ల వివరాలివీ..**

| సామాజికవర్గం | కేటాయింపు సంఖ్య |
|---|---|
| ఓసీ | 6 |
| బీసీ | 3 |
| ఎస్సీ | 2 |
| ఎస్టీ | 1 |
| మొత్తం | 12 |

తిరుపతి అర్బన్: జిల్లాలోని 12 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్ పదవులు భర్తీ చేయడానికి రిజర్వేషన్లను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ బుధవారం వెల్లడించారు. ఆ మేరకు ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఓసీ(జనరల్)కు, సూళ్లూరుపేట కమిటీకి బీసీ(మహిళ)కు, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఓసీ(మహిళ)కు, గూడూరు నియోజకవర్గంలోని గూడూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఓసీ(జనరల్), వాకాడు మార్కెట్ కమిటీకి ఎస్సీ(మహిళ)కు, చంద్రగిరి నియోజకవర్గంలో తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఓసీ(జనరల్)కు, పాకాల మార్కెట్ కమిటీకి ఎస్సీ(జనరల్‌కు), చంద్రగిరి మార్కెట్ కమిటీకి బీసీ(మహిళ)కు, సత్యవేడు నియోజకవర్గంలోని బీఎన్ కండ్రిగ మార్కెట్ కమిటీని ఎస్టీ(జనరల్‌కు), నాగలాపురం ఓసీ(మహిళకు), నగరి నియోజకవర్గంలోని పుత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి బీసీ(జనరల్)కు, వెంకటగిరి నియోజకవర్గంలోని వెంకటగిరి మార్కెట్ కమిటీకి ఓసీ(మహిళ)కు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. రిజర్వేషన్ ప్రకారమే వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లను ఖరారు చేయాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు. రెండేళ్ల పాటు చైర్మన్ పదవీకాలం ఉంటుందని ఆయన వెల్లడించారు.

**మార్కెట్ కమిటీలపై బోలేడు ఆశలు**

ఏఎంసీలకు రిజర్వేషన్లు ఖరారు చేసిన నేపథ్యంలో ఆ పదవులపై పలువురు బోలెడు ఆశలు పెంచుకున్నారు. జిల్లాలోని 12 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమించడానికి రిజర్వేషన్లు ఖరారు చేయడంతో అంతా వాటికి కోసం ఎదురుచూస్తున్నారు. 12 పదవులను మూడు పార్టీలకు పంపకాలు చేస్తే ఒక్కో పార్టీకి 4 చైర్మన్ పదవులు వస్తాయని చర్చసాగుతోంది. ఆ మేరకు ఆయా పార్టీలకు చెందిన ఆశావాహులు పదవుల కోసం లాబీయింగ్ మొదలుపెట్టారు. అయితే బీసీ జనాభా అధికంగా ఉన్న నేపథ్యంలో వారికే అధిక స్థానాల కేటాయింపు ఉంటుందని అంతా భావించారు. అయితే కూటమి సర్కార్ బీసీలకు కేవలం మూడు స్థానాలనే ఖరారు చేయనున్నారు. ఓసీలకు మాత్రం 6 స్థానాలను కట్టబెట్టనున్నారు. మరోవైపు ఎస్సీలకు కేవలం రెండు స్థానాలు, ఎస్టీలకు ఒక్క స్థానంతోనే సరిపెట్టారని పలువురు చర్చించుకుంటున్నారు.

**ఆదాయ మార్కెట్ కమిటీలు ఓసీలకే**

రాబడి అధికంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఓసీలకే కేటాయింపు చేశారని చర్చ సాగుతుంది. ప్రధానంగా జిల్లాలో అత్యధిక రాబడి వచ్చే వ్యవసాయ మార్కెట్ కమిటీ శ్రీకాళహస్తి. ఈ సారి ఈ కమిటీని బీసీలకు కేటాయిస్తారని కొద్ది నెలలుగా పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. అయితే ఎంచక్కా ఓసీ మహిళకు కేటాయించారు. అలాగే నాయుడుపేట, గూడూరు, తిరుచానూరు, వెంకటగిరి మార్కెట్ కమిటీలపైనా బీసీలు ఆశలు పెట్టుకున్నారు. అయితే కీలకమైన కమిటీలను ఓసీలకే కేటాయించారని పలువురు బీసీ నేతలు చర్చించుకుంటున్నారు. సీఎం చంద్రబాబు టీడీపీ అంటేనే బీసీల పార్టీ అంటూ పదేపదే ఉపన్యాసాలు చేస్తుంటారని, అయితే పదవులు మాత్రం ఓసీలకు కట్టబెడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు వెలంపాడు విద్యార్థులు



కె.సుబ్రమణ్యం



కె.దివ్య

రేణిగుంట: మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు శ్రీకాళహస్తి మండలం వెలంపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ముని రేణుక తెలిపారు. గత నెల 10,11 తేదీల్లో పల్నాడు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ రగ్బీ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు కె.సుబ్రమణ్యం(పదో తరగతి), కె.దివ్య(తొమ్మిదో తరగతి) ప్రతిభ చూపారన్నారు. దీంతో వారు జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నట్లు చెప్పారు. పీడీ ప్రసాద్, హరికృష్ణ, అమరనాథ్ పిల్లలను అభినందించారు.

### 17 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న కేసుల్లో 17 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెంట్ ఎన్వీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ట్రాఫిక్ డీఎస్పీల ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

# ఊర్లో దొంగలు పడ్డారు!

- 9 ఇళ్లలో చోరీ
- బంగారు, వెండి, నగదు అపహరణ

చంద్రగిరి: ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా 9 ఇళ్లకు కన్నం వేసిన సంఘటన మండలంలోని ముంగళిపట్టులో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చంద్రగిరి మండలంలోని ముంగళిపట్టు గ్రామంలో కొద్ది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు రెక్కీ నిర్వహించారు. గ్రామంలో సుమారు 9 ఇళ్లలో ఎవరూ లేరని దుండగులు నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి సుమారు ఏడుగురు సభ్యులు గల దొంగల ముఠా గ్రామంపై పడినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రభాకర్‌నాయుడు, లత, శివలీల, సోమేష్, గిరి నాయుడు, రామ్మూర్తి శెట్టి, ముంగళిపట్టు ఎస్సీ కాలనీ సమీపంలోని దిలీప్ నాయుడు, మురళి, నాగమ్మ ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. బుధవారం ఉదయం స్థానికులు ఆ ఇళ్లలోని విలువైన వస్తువులు, ఆభరణాలు, నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. అనంతరం ఆయా ఇళ్ల యజమానులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.



ఓ ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేసిన దొంగలు

**ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ**

ముంగళిపట్టులో చోరీ జరిగినట్లు తెలుసుకున్న చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి తన బృందంతో కలసి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. ఆయా ఇళ్లలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులను పరిశీలించి, క్లూస్ టీం అధికారులకు సమాచారం అందించారు. చోరీ దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో ఆ దిశగా పోలీసులు దొంగల కోసం గాలిస్తున్నారు. చోరీలపై పోలీసులను వివరణ కోరగా...ఇప్పటి వరకు బాధితులు నుంచి సరైన ఫిర్యాదు అందించలేదని, ఫిర్యాదులు అందిన తర్వాత వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

### వాకర్స్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్‌గా శాంతినాడార్



శాంతి నాడార్

తిరుపతి కల్చరల్: వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్302(రాయలసీమ, తమిళనాడు, కర్ణాటక,కేరళ) రాష్ట్రాల డిప్యూటీ గవర్నర్‌గా తిరుపతికి చెందిన శాంతి నాడార్ ఎన్నికైనట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిక్ట్ 302 పరిధిలోని వాకర్స్ సంఘాలను బలోపేతం చేసి, సమాజ హిత కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని శాంతి నాడార్ ఈ సందర్భంగా తెలిపారు. అలాగే వాకర్స్ సంక్షేమం కోసం ఆరోగ్య అవగాహన సదస్సులు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారణమైన వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు డాక్టర్ రవిరాజు ఆర్కాట్ కృష్ణప్రసాద్, మాధవ నాయుడుకు ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సిండికేట్ మద్యంపై సలార్ సీల్



సలార్ సీల్



మద్యం అమ్మే దుకాణం

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత శ్రీకాళహస్తిలో మద్యం దుకాణాలు ఎవరికీ దక్కుండా గంపగుత్తగా టీడీపీ నేతలే దక్కించుకున్నారు. దుకాణాలను సిండికేట్ చేసి, షేర్ల రూపంలో పదిపైసల వాటా నుంచి అమ్మేస్తున్నారు. బెల్టుషాపుల్లో అమ్మే ప్రతి మద్యం బాటిల్‌పై సలార్ సినిమా తరహాలో ఓ సీల్ వేస్తున్నారు. సిండికేట్ షాపుల్లో ఆ సీల్ ఉంటేనే అమ్మాలని సీల్ లేని మద్యం అమ్మితే పోలీసులకు తెలిపేలా ఓ వ్యవస్థను రూపొందించుకున్నారు. బయట నుంచి మద్యం తెచ్చి అమ్మే అవకాశం లేకుండా స్థానిక సిండికేట్ నుంచే మాత్రమే మద్యం అమ్మాలని సలార్ సీల్ రూపొందించారు. అయితే మూడు నెలలుగా మద్యం వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగడంతో సంక్రాంతి, జనవరి ఫస్టు రావడంతో సిండికేట్‌కు లాభాల పంట పండింది. ఈ సలార్ సీల్‌తో బెల్టు షాపుల్లో సైతం ఈ మద్యం అమ్ముతున్నారు. ఎక్సైజ్ అధికారులు ఈ సలార్ సీల్ చూసి భయపడిపోతున్నారు. ఎవరైనా అధికారులు అటుపోతే సీల్ చూపి వారిని వెనక్కి పంపిస్తున్నారు. దీనిపై శ్రీకాళహస్తి పట్టణంలో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాళహస్తి చరిత్రలో ఈ విధంగా మద్యం షాపుల్లో చేయడం ఇదే మొదటి సారి. గోవా వంటి కేంద్ర పాలిట ప్రాంతంలో మాత్రమే కూల్‌డ్రింక్ షాపులో మద్యం దొరికేది. ఈ కూటమి ప్రభుత్వంలో మాత్రం శ్రీకాళహస్తిలో ఎక్కడ పడితే అక్కడ మద్యం దొరుకుతోంది. అధికారులు మాత్రం ఏం పట్టించుకోనన్నట్లు వ్యవహరిస్తున్నారు.

### పేదల వైద్యసేవలపై నిర్లక్ష్యం వద్దు

– డీఎం అండ్ హెచ్ఓ బాలకృష్ణ నాయక్



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న డీఎం అండ్ హెచ్ఓ

వరదయ్యపాళెం: పేదలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణ నాయక్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వరదయ్యపాళెం మండలంలోని చిన్న పాండూరు పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత ప్రభుత్వంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించి, అన్ని వసతులతో చక్కగా నిర్మించారని సంతృప్తి వ్యక్తం చేశారు. అదే స్ఫూర్తితో పేద ప్రజలకు వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారులు ఆస్పత్రిలో అటెండర్ల కొరత ఉందని, దాన్ని తీర్చాలని, ఈ ప్రాంతంలో రోజువారీ 300కు పైగా ఓపీలు నమోదవుతున్న నేపథ్యంలో మందుల కేటాయింపు కొంచెం ఎక్కువగా చేయాలని కోరారు. దీనిపై డీఎం అండ్ హెచ్ఓ స్పందిస్తూ అదనపు మందుల పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. అటెండర్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శాంతాకుమారి, జిల్లా లెప్రసీ అధికారి శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ పద్మావతి, పీహెచ్‌సీ వైద్యాధికారులు అనిత, లావణ్య ఉన్నారు.

### ఐజర్‌లో నేటినుంచి తిరునాల్

రేణిగుంట: ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలోని ఐజర్‌లో గురువారం నుంచి 4 రోజుల పాటు తిరునాల్ పేరుతో కార్యక్రమం జరగనుంది. ఇందుకు ఐజర్ ప్రాంగణాన్ని ముస్తాబు చేస్తున్నారు. తమిళ సంస్కృతి, సంప్రదాయాలు మేళవించిన ఈ ఉత్సవంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొంటారు.

### చీటింగ్ కేసులో బ్యాంకు ఉద్యోగికి జైలు

తిరుపతి లీగల్: బ్యాంకు డిపాజిట్ సొమ్మును తన సొంతానికి వాడుకుని మోసం చేసిన కేసులో తిరుమలలోని ఆంధ్ర బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహించిన కే. శ్రీధర్ కు ఏడాది జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2008 సంవత్సరంలో టీటీడీ అతిథి గృహాలకు చెందిన సొమ్మును టీటీడీ సిబ్బంది తిరుమలలోని ఆంధ్ర బ్యాంకులో డిపాజిట్ చేసేవారు. ఆ బ్యాంకులో క్యాషియర్గా విధులు నిర్వహిస్తున్న నిందితుడు కే శ్రీధర్ అధికారుల సంతకాలను తానే చేసి, సుమారు రూ.4,91,960 తన సొంతానికి వాడుకున్నాడు. దీనిపై బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎంఎస్ రామ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు శ్రీధర్‌ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి శ్రీధర్ కు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జయశేఖర్ వాదించారు.

# పకడ్బందీగా ప్రమోషన్లు

డీఎస్సీ పరీక్షలు నిర్వహించాలన్నా... ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నా సీనియారిటీ జాబితా తలనొప్పిగా మారింది. అయ్యోర్ల సీనియారిటీ జాబితా కచ్చితత్వంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చాలా వరకు ప్రక్షాళన చేపట్టింది. అదే విధంగా ప్రస్తుతం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసేందుకు కసరత్తు చేపట్టారు.

- ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాకు కసరత్తు
- ప్రత్యేక బృందాలతో పరిశీలన
- 1989 డీఎస్సీ నుంచి 2018వ వరకు జాబితా
- ఈనెల 10 లోపు పూర్తి చేసేలా చర్యలు

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల సీనియారిటీ జాబితాను పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. ఈ కసరత్తును ఈనెల 10వ తేదీలోపు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 4,738 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు సీనియారిటీ జాబితాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీ కేడర్ నుంచి హెచ్ఎం కేడర్ వరకు సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు.



చిత్తూరు డీఈఓ కార్యాలయం

**ప్రత్యేక బృందాలు నియామకం**

సీనియారిటీ జాబితాను సిద్ధం చేసేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ కసరత్తును ఉమ్మడి చిత్తూరు జిల్లా నోడల్ అధికారి కేడర్‌లో డీఈఓ వరలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు. కసరత్తును పకడ్బందీగా పూర్తి చేసేందుకు చిత్తూరు, తిరుపతి డీఈఓ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న విద్యాశాఖ సిబ్బందిని నియమించారు. ఒక్కో బృందానికి ఇద్దరు సిబ్బంది చొప్పున 9 బృందాలను నియమించి కసరత్తు చేపడుతున్నారు. ఈనెల 10వ తేదీలోపు కసరత్తును పూర్తి చేసి రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు జాబితాను పంపేలా కసరత్తు నిర్వహిస్తున్నారు.

**కసరత్తు సాగుతోంది ఇలా..**

జిల్లాలో 1989వ డీఎస్సీ నుంచి 2018వ సంవత్సరం డీఎస్సీ వరకు కేడర్‌ల వారీగా సీనియారిటీ జాబితాలను సిద్ధం చేస్తున్నారు. మొదటగా అన్ని మండలాల్లో ఎంఈఓలు జాబితాలను సిద్ధం చేసి డీఈఓ కార్యాలయానికి వివరాలు పంపుతున్నారు. ఆ వివరాలను డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు రికార్డుల ఆధారంగా మరో మారు పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 8295 ఎస్జీటీ కేడర్ పోస్టులు ఉండాల్సి ఉండగా 6,443 మంది, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 3263 పోస్టులు ఉండగా 3180 మంది విధులు నిర్వహిస్తున్నారు. హెచ్ఎం కేడర్‌లో 408 మంది టీచర్ల సీనియారిటీ జాబితాలను సిద్ధం చేస్తున్నారు.

**సీనియారిటీ జాబితా కసరత్తు వివరాలు**

| | |
|---|---|
| తిరుపతి జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు | 1,232 |
| సిద్ధం చేస్తున్న ఎస్జీటీ సీనియారిటీ జాబితా | 6,443 |
| స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో | 3,263 |
| హెచ్ఎం కేడర్‌లో | 408 |

**జాబితా సిద్ధం చేస్తున్నాం**



ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల టీచర్ల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించిన నియమ, నిబంధనలను పాటిస్తూ కసరత్తు నిర్వహిస్తున్నారు. ఈ నెల 10వ తేదీలోపు కసరత్తును పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్జీటీ కేడర్‌లో 6443 మందికి గాను 3180 మంది జాబితాలు సిద్ధం చేయడం జరిగింది. మిగిలిన 3,263 మంది జాబితాలు, అదే విధంగా ఇతర కేడర్‌ల టీచర్ల జాబితాలను సిద్ధం చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు జిల్లా

### ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న కారు

- మహిళ మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘటన



సంఘటన స్థలం (ఇన్‌సెట్) సోల్లేటి ప్రవీణ మృతదేహం

నాయుడుపేట టౌన్: కారు ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన నాయుడుపేట సమీపంలోని జాతీయ రహదారి రింగ్ రోడ్డు వద్ద బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన విశ్వనాథుని లక్ష్మీనారాయణ, అతని భార్య రాజ్యలక్ష్మి, కుమారుడు సుమంత్ కారులో తిరుమలకు బయలుదేరారు. మార్గం మధ్యలోని నాయుడుపేట పట్టణంలోని తమ బంధువైన సోల్లేటి ప్రవీణ ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి సోల్లేటి ప్రవీణ, ఆమె కుమార్తె అనూషతో కలసి తిరుమలకు వెళ్లారు. వేంకటేశ్వరస్వామి దర్శనానంతరం తిరుగుప్రయాణమయ్యారు. మార్గం మధ్యలోని నాయుడుపేట సమీపంలోని జాతీయ రహదారి రింగ్ రోడ్డు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో పాడైపోయి ఆపి ఉన్న వాహనాన్ని కారు ఢీ కొంది. ఈ ఘటనలో నాయుడుపేట పట్టణానికి చెందిన సోల్లేటి ప్రవీణ (44) అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమార్తె సోల్లేటి అనూష, వారికి సమీప బంధువులైన తూర్పుగోదావరి జిల్లా భీమవరం పట్టణానికి చెందిన విశ్వనాథుని లక్ష్మీనారాయణ, అతని భార్య రాజ్యలక్ష్మి, కారు నడుపుతున్న లక్ష్మీనారయణ కుమారుడు విశ్వనాథుని సుమంత్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే సీఐ బాబి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**రేషన్ బియ్యం అక్రమ రవాణా వాహనంగా గుర్తింపు**

పాడైపోయి రోడ్డు పక్కన ఆపి ఉంచిన వాహనం రేషన్ బియ్యం అక్రమ రవాణా వాహనంగా గుర్తించినట్లు సీఐ బాబి తెలిపారు. వాహనం వద్ద ఎవరూ లేరని, పరారైనట్లు చెప్పారు. దీంతో వాహనంలోని 73 బస్తాల్లోని 3 టన్నుల రేషన్ బియ్యాన్ని రెవెనూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. వాహన వివరాలను తెలుసుకుంటున్నామన్నారు.